క్లుప్తంగా

సాయినాథునికి విశేష పూజలు



ప్రత్యేకాలంకరణలో బాబా

పొదలకూరు: పట్టణంలోని శిరిడీ సాయిబాబా మందిరంలో గురువారం విశేష పూజలను నిర్వహించారు. ఉదయం అభిషేకాలు, అష్టోత్తర, సహస్రనామ పూజలు, మధ్యాహ్నం భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. శాశ్వత ఉభయకర్తల గోత్రనామాలతో పూజలు, సాయంత్రం మందిరంలో భక్తుల భజనలు, రాత్రి స్వామివారి పల్లకిసేవ గావించారు. శేజ్‌హారతితో పూజా కార్యక్రమాలు ముగిశాయి.

వికసిత్ కృషి సంకల్ప్‌ను విజయవంతం చేయండి



మాట్లాడుతున్న డీఏఓ సత్యవాణి

కోవూరు: కేంద్ర ప్రభుత్వం ఈనెల 29 నుంచి జూన్ 12 వరకు జిల్లా వ్యాప్తంగా వికసిత్ కృషి సంకల్ప్ అభియాన్ కార్యక్రమాన్ని నిర్వహిస్తోందని, దీనిని విజయవంతం చేయాలని జిల్లా వ్యవసాయశాఖ అధికారి(డీఏఓ) పి.సత్యవాణి తెలిపారు. మండల కేంద్రమైన కోవూరులో ఆమె గురువారం మాట్లాడారు. కృషి విజ్ఞాన కేంద్ర శాస్త్రవేత్తలు, కేంద్ర ప్రభుత్వ వ్యవసాయ శాస్త్రవేత్తలు, వ్యవసాయ విశ్వవిద్యాలయ శాస్త్రవేత్తలు గ్రూపులుగా ఏర్పడి రైతులకు ఖరీఫ్ పంటలకు సంబంధించి అవసరమైన సూచనలు ఇవ్వాలని, నూతన సాంకేతిక పరిజ్ఞానం అందించాలన్నారు. దీనితో పాటు రైతులతో నేరుగా ముఖాముఖి కార్యక్రమాలు చేపడతారన్నారు. అన్నదాత సుఖీభవకు రైతుల జాబితా పరిశీలన జరుగుతుందన్నారు. అనంతరం కేంద్రీయ వరి పరిశోధన సంస్థ సీనియర్ శాస్త్రవేత్త లక్ష్మీప్రసన్న మాట్లాడుతూ వ్యవసాయంలో ఏమైనా సమస్యలుంటే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. కాగా పలువురు రైతులు మాట్లాడుతూ ధాన్యం కొనుగోలులో 17 శాతం తేమతో ఆరబెట్టడం కష్టంగా ఉందన్నారు. కార్యక్రమంలో ఆత్మ పీడీ శివన్నారాయణ, శాస్త్రవేత్త డాక్టర్ వినీత, ఏడీ సుజాత, మధురిమ, కోవూరు ఏఓ ఇందిరావతి, సహాయకులు మౌనిక, మెహరున్నీసా, చైతన్య, నారాయణ, వంశీ తదితరులు పాల్గొన్నారు.

అన్నదానం



విడవలూరు: మండల కేంద్రంలోని దత్తసాయి మందిరంలో గురువారం విశేష పూజలు నిర్వహించారు. పెళ్లకూరు కోటయ్య నాయుడు, రామసుబ్బమ్మల జ్ఞాపకార్థం కుమారుడు రామయ్య నాయుడు ఆధ్వర్యంలో అన్నదానం కార్యక్రమం జరిగింది. అర్చకుడు మధు, సేవకుడు వెంకయ్య పాల్గొన్నారు.

బైక్ అదుపుతప్పి వ్యక్తికి గాయాలు

వెంకటాచలం: మోటార్ బైక్ అదుపుతప్పి పడి వ్యక్తి గాయపడిన ఘటన మండలంలోని కాకుటూరు సమీపంలో గురువారం జరిగింది. గూడూరు పట్టణానికి చెందిన పవన్‌కుమార్ పని నిమిత్తం నెల్లూరుకు వెళ్లారు. తిరిగి గూడూరుకు వెళ్తుండగా, కాకుటూరు సమీపానికి చేరుకోగానే ఎదురుగా కారు అడ్డురావడంతో బైక్ అదుపుతప్పి పడింది. ఈ ప్రమాదంలో పవన్‌కుమార్‌కు గాయాలవ్వగా చికిత్స నిమిత్తం నెల్లూరుకు తరలించారు.

విద్యుత్ అంతరాయాలు లేకుండా చర్యలు

పొదలకూరు: పట్టణంలోని పద్మావతి నగర్‌లో విద్యుత్ అంతరాయాలు లేకుండా చర్యలు తీసుకుంటామని ఆ శాఖ ఏడీఈ సుబ్రమణ్యం అన్నారు. ఆయన గురువారం మాట్లాడుతూ పద్మావతి నగర్‌లో ట్రాన్స్‌ఫార్మర్ సమస్య లేదన్నారు. పాత విద్యుత్ లైన్ల స్థానంలో కొత్త లైన్లను ఏర్పాటు చేయాల్సి ఉందన్నారు. ప్రస్తుతం ఏఈ లేనందున మరొకరు బాధ్యతలు స్వీకరించిన వెంటనే మరమ్మతులను చేపడతామన్నారు. విద్యుత్ అంతరాయాలకు సంబంధించిన సమాచారం తమ వద్ద ఉందన్నారు. ఇటీవల పద్మావతి నగర్‌లో విద్యుత్ స్తంభాలను పరిశీలించామన్నారు.

ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేసుకోండి

మనుబోలు: ప్రభుత్వం మంజూరు చేసిన అదనపు నగదుతో ఇళ్ల నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేసు కోవాలని ఎంపీడీఓ జలజాక్షి లబ్ధిదారులకు సూచించారు. కట్టువపల్లి, బద్దెవోలు, వెంకన్నపాళెంలో నిర్మాణంలో ఉన్న ఇళ్లను ఆమె పరిశీలించి లబ్ధిదారులతో మాట్లాడారు. ప్రభుత్వం ఎస్టీలకు రూ.75 వేలు, ఎస్సీ, బీసీలకు రూ.50 వేల నగదును అదనంగా చెల్లిస్తోందని తెలిపారు.

వీడని ప్లాస్టిక్ భూతం

- నిబంధనలకు తూట్లు
- మార్కెట్లో విచ్చలవిడిగా లభ్యం
- ఎక్కడ చూసినా 20 మైక్రాన్ల కవర్లే
- చెత్తలో సగం ఈ వ్యర్థాలే
- పొంచి ఉన్న ప్రమాదకర జబ్బులు



డంపింగ్ యార్డులో దర్శనమిస్తున్న ప్లాస్టిక్ కవర్లు

నెల్లూరు(బారకాసు): నగరంలో ప్లాస్టిక్ వ్యర్థాలు పేరుకుపోతున్నాయి. చెత్తకుప్పల మొదలుకొని డ్రైనేజీ కాలువలు,, ఎక్కడ చూసినా ప్లాస్టిక్ వ్యర్థాలే దర్శనమిస్తున్నాయి. నిబంధనలకు పాతరేయడంతో ప్రమాద తీవ్రత ఏటా పెరుగుతోందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. చర్యలు చేపట్టాల్సిన యంత్రాంగం స్పందించడం లేదు.

ప్లాస్టిక్ కవర్ల వినియోగం పెరుగుతున్నా, వాటిని రీసైక్లింగ్ చేసే యూనిట్లు అతి తక్కువగా ఉండటం విస్మయానికి గురిచేస్తోంది.

అమలు కాని నిబంధనలు

తొలుత 40 మైక్రాన్ల మందమున్న ప్లాస్టిక్ కవర్లనే వినియోగించాలనే నిబంధన ఉండేది. అయితే 2016లో కేంద్ర పర్యావరణ మంత్రిత్వ శాఖ కొత్త నిబంధనలను విధించింది. 50 మైక్రాన్ల కంటే తక్కువ మందం ఉన్న ప్లాస్టిక్ కవర్ల తయారీదారులపై కఠిన చర్యలు చేపట్టాలని ఆదేశించింది. ఆస్పత్రుల్లో విడుదలవుతున్న బయో వ్యర్థాలపై సైతం ఆంక్షలు విధించింది. అయితే ఈ నిబంధనలు జిల్లాలో అమలు కావడం లేదు. ఇటీవలి కాలంలో 20 మైక్రాన్ల మందం ఉన్న ప్లాస్టిక్ కవర్లు విచ్చలవిడిగా అందుబాటులోకి వచ్చాయి. బడ్డీ కొట్లు, చికెన్ షాపులు, టిఫిన్ అంగళ్లు, తోపుడు బండ్లపై పండ్లు, కూరగాయలను విక్రయించేవారు తదితరులు వీటినే వినియోగిస్తున్నారు. నిబంధనలకు విరుద్ధంగా ప్లాస్టిక్ కవర్లను ఉత్పత్తి చేసినా, వినియోగించినా రూ.25 వేల జరిమానా విధించాలనే నిబంధన ఉన్నా, పట్టించుకునే నాథుడే లేరు. అప్పుడప్పుడూ దాడులు నిర్వహించి, ఆపై మిన్నకుండిపోతున్నారు. ఫలితంగా వీటి వినియోగం నానాటికీ తీవ్రమవుతోంది.

నియంత్రణకు అధికారులేరీ..?

నాసిరకం ప్లాస్టిక్ బ్యాగుల నియంత్రణ లీగల్ మెట్రాలజీ పరిధిలోకి వస్తుంది. అయితే ఆ శాఖ అధికారులు నియంత్రిస్తున్న దాఖలాల్లేవు. పెద్ద మాళ్లలో సైతం 20 మైక్రాన్ల బ్యాగులను వాడుతున్నా పట్టించుకోవడం లేదు. కొన్ని టీస్టాళ్లలో వేడి టీని ఇలాంటి కవర్లలోనే పార్శిల్ చేసిస్తున్నారు. ఇది అత్యంత ప్రమాదకరమని వైద్యులు చెప్తున్నా, పెడచెవిన పెడుతున్నారు. ఇప్పటికైనా వీటిపై కఠినంగా వ్యవహరించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

చర్యలు చేపడుతున్నాం



ప్లాసిక్ నియంత్రణకు చర్యలు చేపడుతున్నాం. నిషేధిత ప్లాస్టిక్‌ను ఎవరూ వినియోగించరాదు. నియంత్రణకు తరచూ డ్రైవ్‌లు చేపడుతున్నాం. సామాజిక స్పృహతో ప్లాస్టిక్‌ను వాడకూడదు.

– చైతన్య, హెల్త్ ఆఫీసర్, నగరపాలక సంస్థ

పౌష్టికాహార పంపిణీ



నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): నగరంలోని ఏసీ స్టేడియంలో పిల్లలు, క్రీడాకారులకు పౌష్టికాహారాన్ని వివేకానంద వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం అందజేశారు. దాతలుగా చంద్రమౌళి, ఫయాజ్ అహ్మద్, ప్రభాకర్ వ్యవహరించారు. అసోసియేషన్ అధ్యక్షుడు చింతల అమరేంద్రరెడ్డి, కార్యదర్శి పొన్నం రవిచంద్ర, రాఘవేంద్ర, అంకిరెడ్డి, నందిమండలం సుబ్బరాజు, గోపాల్‌రెడ్డి, విజయమోహన్‌నాయుడు, రాజా రమేష్ తదితరులు పాల్గొన్నారు.

పదోన్నతుల్లో అయ్యోర్ల ఇక్కట్లు

- అర్ధరాత్రి వరకు కొనసాగిన ప్రక్రియ



పడిగాపులు కాస్తున్న ఉపాధ్యాయులు

నెల్లూరు (టౌన్): స్కూల్ అసిస్టెంట్ల నుంచి హెడ్‌మాస్టర్లుగా ఉద్యోగోన్నతులను కల్పించేందుకు నిర్వహించిన కౌన్సెలింగ్‌లో గురువులు ఇక్కట్ల పాలయ్యారు. వాస్తవానికి బుధవారం నిర్వహించాల్సిన ప్రక్రియను పొద్దుపోయాక గురువారానికి జిల్లా విద్యాశాఖ అధికారులు వాయిదా వేశారు. ఉదయం పదికి ప్రారంభమవుతుందని ప్రకటించినా, రాత్రి 6.30 తర్వాత ప్రక్రియను ప్రారంభించారు. జిల్లాలోని పలు ప్రాంతాలకు ఆప్షన్లు పెట్టుకున్న హెడ్‌మాస్టర్లకు మధ్యాహ్నానికే బదిలీ ఆర్డర్లిచ్చినా కౌన్సెలింగ్‌ను ప్రారంభించలేదు. పదోన్నతుల ప్రక్రియలో రోస్టర్ కమ్ రిజర్వేషన్ జాబితా కూర్పులో అధికారులు తలమునకలయ్యారని తెలిసింది. ఈ నేపథ్యంలో తయారు చేసిన రోస్టర్ జాబితాలో నాలుగు సార్లు మార్పులు, చేర్పులు చేశారని తెలుస్తోంది. జిల్లా విద్యాశాఖ అధికారులకు సరైన అవగాహన లేని కారణంగా రోస్టర్ జాబితాను రూపొందించడంలో ఆలస్యమైందని ఉపాధ్యాయులు పేర్కొంటున్నారు. దూర ప్రాంతాల నుంచి వచ్చిన తాము పడిగాపులు కాయాల్సి వచ్చిందని మండిపడుతున్నారు. జిల్లాలోని జెడ్పీ హైస్కూళ్లలో పనిచేస్తున్న 89 మంది, ప్రభుత్వ హైస్కూళ్లలో పనిచేస్తున్న ఎనిమిది మంది, మున్సిపల్ హైస్కూళ్లలో పనిచేస్తున్న నలుగురు సీనియల్ అసిస్టెంట్లకు హెడ్‌మాస్టర్లుగా ఉద్యోన్నతులు కల్పించారు.

మహానాడుకు హ్యాండిచ్చిన తమ్ముళ్లు

నెల్లూరు సిటీ: కడపలో నిర్వహించిన మహానాడుకు వెళ్లేందుకు ఆర్టీసీ, ప్రైవేట్ బస్సులు, ఇతర వాహనాలను అందుబాటులో ఉంచారు. వీరికి ఆహార పొట్లాలనూ అందుబాటులో ఉంచారు. అయితే నగరం నుంచి వెళ్లేందుకు తెలుగు తమ్ముళ్లు ఆసక్తి చూపలేదు. ఇష్టం లేకపోయినా కొందరు బలవంతంగా వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది.

ఒక్కో డివిజన్‌కు నాలుగు బస్సులు

మహానాడుకు వెళ్లేందుకు గానూ నగరంలోని 26 డివిజన్ల నుంచి 104 బస్సులను ఏర్పాటు చేశారు. ఒక్కో డివిజన్‌కు నాలుగు బస్సుల చొప్పున కార్పొరేటర్లు, ఇన్‌చార్జిలకు కేటాయించారు. మొత్తం ఐదు వేల మంది వెళ్లేందుకు రంగం సిద్ధం చేశారు. అయితే బస్సులు బయల్దేరే సమయానికి టీడీపీ కార్యకర్తలు, నేతలు హ్యాండిచ్చారు. ఎక్కడివారు అక్కడే గప్‌చుప్ అయ్యారు. దీంతో ఒక్కో బస్సులో పది నుంచి 15 మందే వెళ్లారు.

హ్యాండిచ్చిన వారి వివరాల సేకరణ

నెల్లూరు నుంచి జనాభాను తీసుకెళ్లేందుకు మంత్రి నారాయణ వర్గం చేసిన యత్నాలు విఫలమయ్యాయి. నారాయణ టీమ్, మహిళా శక్తి టీమ్, యూత్ టీమ్‌లు మొత్తం మూడు వేల మంది ఉండగా, కనీసం సగం మంది వెళ్లలేదు. ఈ క్రమంలో ఎవరెవరు హాజరుకాలేదనే అంశంపై వివరాలను నారాయణ వర్గం సేకరిస్తోంది.

జయభారత్ ఆస్పత్రికి ట్రెడ్‌మిల్ వితరణ



నెల్లూరు(అర్బన్): నగరంలోని జయభారత్ ఆస్పత్రికి రూ.రెండు లక్షల విలువైన ట్రెడ్‌మిల్‌ను గురువారం అందజేశారు. ఆస్పత్రి చైర్మన్ పొన్నలూరు సీతారామిరెడ్డి సతీమణి పొన్నలూరు జ్యోతిరెడ్డి తన తల్లిదండ్రులు చంద్రశేఖర్‌రెడ్డి, భువనేశ్వరమ్మ జ్ఞాపకార్థం దీన్ని ఇచ్చారు. గుండె వైద్యనిపుణులు లక్ష్మీ శ్రీనివాస్, ట్రస్ట్ కోశాధికారి గుర్రం సుధాకర్, జీఎం గురుప్రసాద్, డిప్యూటీ మేనేజర్ వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

సీఈఓలకు శిక్షణ



నెల్లూరు(వీఆర్సీసెంటర్): జిల్లాలోని 88 ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాల సీఈఓలకు కంప్యూటర్‌పై శిక్షణ కార్యక్రమాన్ని గాంధీబొమ్మ సెంటర్‌లోని డీసీసీబీలో గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా డీసీఓ గుర్రప్ప మాట్లాడారు. జిల్లాలోని అన్ని పీఏసీఎస్‌లలో కంప్యూటరీకరణ పూర్తయిందని చెప్పారు. దీంతో సంఘ వ్యవహారాల్లో పారదర్శకత సులభతరం కానుందని వివరించారు. ఆడిట్‌ను ఆన్‌లైన్ ద్వారా నిర్వహించాలని, దీనికి అవసరమైన రికార్డులను సిద్ధం చేసుకోవాలని సూచించారు. సంఘాల్లో కొత్త సభ్యుల ప్రవేశానికి ఈ – కేవైసీ తప్పనిసరన్నారు. డీసీసీబీ సీఈఓ శ్రీనివాసరావు, విజయవాడ నుంచి వచ్చిన ఆప్కాబ్ డీజీఎంలు అశోక్, విజయసారథి, జీఎం సరిత, మనీషా తదితరులు పాల్గొన్నారు.

ఆధునికీకరణ పనుల పరిశీలన

నెల్లూరు (టౌన్): వీఆర్ హైస్కూల్‌ను అంతర్జాతీయ స్థాయిలో మంత్రి నారాయణ తీర్చిదిద్దనున్నారని ఆయన కుమార్తె శరణి తెలిపారు. పాఠశాలలో చేపట్టిన ఆధునికీకరణ పనులను ఎన్‌సీసీ సిబ్బందితో కలిసి గురువారం ఆమె పరిశీలించారు.

అనారోగ్యంతో అటెండర్ మృతి

నెల్లూరు(క్రైమ్): అనారోగ్యంతో ఆస్పత్రికి తరలిస్తుండగా అటెండర్ మృతి చెందారు. పోలీసుల సమాచారం మేరకు.. లేక్‌వ్యూ కాలనీకి చెందిన రామయ్య (54) శబరి శ్రీరామక్షేత్రం సమీపంలోని తెలుగుగంగ కార్యాలయంలో అటెండర్‌గా.. ఆయన భార్య విజయమ్మ నగరంలోని ఓ వస్త్ర దుకాణంలో పనిచేస్తున్నారు. కొంతకాలంగా వివిధ అనారోగ్య సమస్యలతో ఆయన బాధపడుతున్నారు. ఈ క్రమంలో బుధవారం రాత్రి తీవ్ర అనారోగ్యానికి గురయ్యారు. హుటాహుటిన జీజీహెచ్‌కు తరలించగా, పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందారని నిర్ధారించారు. ఘటనపై దర్గామిట్ట పోలీసులకు భార్య ఫిర్యాదు చేశారు. హాస్పిటల్‌కు ఎస్సై రమేష్‌బాబు చేరుకొని పోస్ట్‌మార్టం నిమిత్తం మృతదేహాన్ని మార్చురీకి తరలించారు. కేసు నమోదు చేశారు. కాగా మృతుడికి ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): నారాయణరెడ్డిపేట సబ్‌స్టేషన్ పరిధిలోని పలు ఫీడర్లలో మరమ్మతులను చేపట్టనున్న నేపథ్యంలో వివిధ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా శుక్రవారం ఉండదని ఏఈ శ్రీలక్ష్మి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పెద్ద చెరుకూరు, అల్లీపురం, గుడిపల్లిపాడు తదితర ప్రాంతాల్లో ఉదయం తొమ్మిది నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు సరఫరా ఉండదని చెప్పారు.

నకిలీ మీ - సేవ కేంద్రాలపై చర్యలకు వినతి

నెల్లూరు(అర్బన్): జిల్లాలో నకిలీ మీ – సేవ కేంద్రాలపై దాడులు నిర్వహించి చట్టపరమైన చర్యలు చేపట్టాలని మీ – సేవ, ఈ – సేవ అసోసియేషన్ సెక్రటరీ అనిల్‌కుమార్ కోరారు. ఈ మేరకు పలువురితో కలిసి కలెక్టరేట్లో మీ – సేవ అడ్మినిస్ట్రేటివ్ అధికారికి వినతిపత్రాన్ని గురువారం అందజేశారు.

అండగా ఉంటాం



పూజితను కలిసిన నేతలు

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): అక్రమ కేసులో అరెస్టయిన మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి, వారి కుటుంబసభ్యులకు అండగా ఉంటామని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ యువజన, విద్యార్థి విభాగ నేతలు పేర్కొన్నారు. డైకస్‌రోడ్డులోని కాకాణి గోవర్ధన్‌రెడ్డి నివాసంలో ఆయన కుమార్తె పూజితను యువజన, విద్యార్థి విభాగ జిల్లా అధ్యక్షులు ఊటుకూరు నాగార్జున, ఆత్రేరెడ్డి గురువారం కలిసి ధైర్యం చెప్పారు. కూటమి ప్రభుత్వం అవలంబిస్తున్న తీరును ఎండగట్టారు. హామీలను అమలు చేయకుండా.. డైవర్షన్ పాలిటిక్స్‌ను టీడీపీ అనుసరిస్తోందని మండిపడ్డారు.

క్యాంపస్ డ్రైవ్‌లో 105 మందికి ఉద్యోగాలు



నెల్లూరు (టౌన్): నగరంలోని రావుస్ డిగ్రీ కళాశాలలో క్యాంపస్ డ్రైవ్‌ను టాటా ఎలక్ట్రానిక్స్ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా డైరెక్టర్ శివసంకేత్ మాట్లాడారు. 200 మంది విద్యార్థులు హాజరుకాగా, రాత పరీక్ష, ఇంటర్వ్యూల అనంతరం 105 మంది ఎంపికయ్యారని చెప్పారు. టెక్నికల్ అనలిస్ట్‌గా వీరికి వార్షిక వేతనంగా రూ. 2.4 లక్షలతో పాటు ఉచిత భోజనం, క్యాబ్ సౌకర్యాన్ని కల్పించనున్నారని వెల్లడించారు. కళాశాల సీఈఓ శివారెడ్డి, ప్లేస్‌మెంట్ అధికారి షరీఫ్ తదితరులు పాల్గొన్నారు.

రక్తదాన అవగాహన యాత్రకు సంఘీభావం



నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): రక్తదానంపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ 22 రోజులుగా సైకిల్ యాత్ర నిర్వహిస్తున్న రక్తదాన మోటివేటర్ అరిగెల సాయిరామ్‌కు న్యాయవాది మలిరెడ్డి శ్రీనివాసులు సంఘీభావం తెలిపారు. పొట్టెపాళెం వద్ద ఆయనకు శాలువా కప్పి, పుష్పగుచ్ఛాన్ని గురువారం అందజేశారు. ఈ సందర్భంగా శ్రీనివాసులు మాట్లాడారు. ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీలో పనిచేస్తూ ఇలాంటి కార్యక్రమాలు చేపట్టిన ఆయనకు తమ వంతు సహాయ, సహకారాన్ని అందజేస్తామని చెప్పారు.

అండర్ బ్రిడ్జిల్లో నీరు నిల్వ ఉండకూడదు



కమిషనర్‌కు వినతిపత్రమిస్తున్న వైఎస్సార్సీపీ నేతలు

నెల్లూరు(బారకాసు): నగరంలోని అండర్ బ్రిడ్జిల వద్ద వర్షపునీరు నిలవకుండా నిరంతరం పర్యవేక్షించాలని కమిషనర్ నందన్ ఆదేశించారు. పదో డివిజన్లోని గిరిజన కాలనీ, 17వ డివిజన్లో గల పార్థసారథి లేఅవుట్ తదితర ప్రాంతాల్లో జరుగుతున్న పారిశుధ్య పనులను గురువారం ఆయన పరిశీలించారు. వివిధ భవనాలకు కొలతలేసి అసెస్మెంట్ డిమాండ్లను తనిఖీ చేశారు. అనంతరం రామలింగాపురం అండర్ బ్రిడ్జి సమీపంలోని పంప్ హౌస్ పనితీరును పర్యవేక్షించారు.

⇨ నగరపాలక సంస్థలో విధులు నిర్వర్తిస్తున్న ఉద్యోగులు తమ గృహాలకు సోలార్ ప్యానళ్లను ఏర్పాటు చేసుకోవాలని కమిషనర్ నందన్ కోరారు. కార్పొరేషన్ కార్యాలయ ప్రాంగణంలో వివిధ కంపెనీల ప్రతినిధులు ఏర్పాటు చేసిన సోలార్ ప్యానళ్ల స్టాళ్లను పరిశీలించిన అనంతరం ఆయన మాట్లాడారు. 90 శాతం వరకు రుణ సదుపాయాన్ని బ్యాంకులు కల్పిస్తున్నాయని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

⇨ ట్యాక్స్ రివిజన్ సర్వేను పారదర్శకంగా నిర్వహించాలని, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి చెందిన వారిళ్లకు మాత్రమే చేసి మిగిలిన గృహాలను వదిలేయడం తగదని పార్టీ 12వ డివిజన్ నేతలు కోరారు. ఈ మేరకు కార్పొరేషన్ కార్యాలయంలో కమిషనర్ నందన్‌కు వినతిపత్రాన్ని అందజేసిన అనంతరం వారు మాట్లాడారు. డివిజన్ పరిధిలోని కొన్ని ప్రాంతాల్లో తమ పార్టీకి చెందిన వారి గృహాలకు మాత్రమే కొలతలు తీసుకొని ఆస్తి పన్ను రివిజన్ చేసే ప్రక్రియకు సిద్ధపడుతున్నారనే విషయం తెలిసిందని, ఇది తగదని సూచించారు. దీనిపై చర్యలు చేపట్టాలని కోరారు.

విద్యాసామగ్రి అందజేత



నెల్లూరు(బృందావనం): పడారుపల్లి దివ్యాంగుల కాలనీలోని ఆచార్య పీసీ రెడ్డి సమాజ మందిరంలో 30 మంది చిన్నారులకు అక్షరాభ్యాసంతో పాటు 70 మంది విద్యార్థులకు విద్యా సామగ్రిని క్రాంతి మహిళా మండలి అధ్యక్షురాలు గుమ్మడి వెంకటలక్ష్మి ఆధ్వర్యంలో గురువారం అందజేశారు. నీలం నాగేశ్వరరావు చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షురాలు పద్మావతి వీటిని అందజేశారని వివరించారు. విజయలక్ష్మి, రాజ్యలక్ష్మి, ధ్రువిత, గుమ్మడి రాజగోపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం



నెల్లూరు(బారకాసు): యోగా సాధనతో సంపూర్ణ ఆరోగ్యం సిద్ధించడంతో పాటు మానసిక ప్రశాంతత లభిస్తుందని మెప్మా పీడీ లీలారాణి పేర్కొన్నారు. నగరంలోని పట్టణ సమాఖ్య – 1 భవనంలో గురువారం నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. యోగాపై అన్ని సంఘ సభ్యులకు శిక్షణ ఇవ్వాలని కోరారు. డీఈఐబీ అంకయ్య, సీఓ అబ్దుల్ అలీ బేగ్, సురేష్, టీఎల్ఎఫ్ అధ్యక్షురాలు మాధవి తదితరులు పాల్గొన్నారు.

జక్కా వెంకయ్యకు నివాళులు



నెల్లూరు(వీఆర్సీసెంటర్): సీపీఎం నేత జక్కా వెంకయ్య వర్ధంతిని నగరంలో గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పార్టీ నగర, రూరల్ కార్యదర్శులు కత్తి శ్రీనివాసులు, కొండా ప్రసాద్, నేతలు సూర్యనారాయణ, నరసింహ, శ్రీనివాసులు, నాగేశ్వరరావు, మస్తాన్‌బీ, అశోక్, భాగ్యమ్మ, కామాక్షమ్మ తదితరులు పాల్గొన్నారు.

⇨ పేదలు, రైతుల కోసం నిరంతరం పోరాటాలు చేసిన గొప్ప వ్యక్తి జక్కా వెంకయ్య అని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు కొనియాడారు. జక్కా వెంకయ్య వర్ధంతిని పురస్కరించుకొని నగరంలోని జెట్టి శేషారెడ్డి విజ్ఞాన కేంద్రంలో సభను నిర్వహించారు. పహల్గామ్ ఉగ్రదాడి – తదనంతర పరిణామాలు అనే అంశంపై సదస్సును జరిపారు. పార్టీ జిల్లా కార్యదర్శి మూలం రమేష్, నగర కార్యదర్శి కత్తి శ్రీనివాసులు, మాదాల వెంకటేశ్వర్లు, అజయ్‌కుమార్, గోగుల శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

నెల్లూరు(అర్బన్): ప్రతి ఒక్కరూ రక్తదానం చేయాలని ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి అసోసియేట్ ప్రొఫెసర్ గంగాధర్ పేర్కొన్నారు. మాజీ ఎమ్మెల్యే, సీపీఎం నేత జక్కా వెంకయ్య వర్ధంతిని పురస్కరించుకొని దర్గామిట్టలోని ప్రభుత్వ పెద్దాస్పత్రిలో పలువురు ఉద్యోగులు రక్తదానం చేశారు. యునైటెడ్ మెడికల్ అండ్ హెల్త్ యూనియన్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో యూనియన్ గౌరవాధ్యక్షుడు నరమాల సతీష్ కుమార్, అధ్యక్ష, కార్యదర్శులు కమ్మటి శ్రీనివాసులు, సందానీబాషా, కార్యవర్గ సభ్యులు సురేంద్ర, సాయి, ప్రసాద్, సురేష్‌రాజు, మధు, విజయకుమార్, యశ్వంత్, వెంకటేష్ పాల్గొన్నారు.

నెల్లూరు సిటీ: పాతవెల్లంటిలో యువకులు రక్తదానం చేశారు. సీపీఎం నేత మాదాల వెంకటేశ్వర్లు, సర్పంచ్ రాధ, పార్టీ మండల కార్యదర్శి జనార్దన్, యడవల్లి రమణయ్య ముత్యాల నాగయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రతిభ పురస్కారాల ప్రదానం



నెల్లూరు(బృందావనం): విద్యార్థులు బాగా చదివి జీవితంలో ఉన్నత స్థితికి చేరుకోవాలని సీజీఎస్టీ అసిస్టెంట్ కమిషనర్ ఉషాకిరణ్‌రాయ్ కాంక్షించారు. పదో తరగతి, ఇంటర్మీడియట్‌లో ప్రతిభ చూపిన 58 మంది విద్యార్థులకు ప్రతిభ పురస్కారాలను పురమందిర ప్రాంగణంలోని వర్ధమాన సమాజ హాల్లో పాస్టర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు గడ్డం హనోక్ ఆధ్వర్యంలో గురువారం అందజేశారు. ఎంఈఓ అబ్దుల్ హమీద్, రెవరెండ్ డేవిడ్ దయాసాగర్, జయప్రకాష్, ఊరందూరు సురేంద్రబాబు, బర్నబాస్, క్రాంతి, జోసఫ్, పీడబ్ల్యూఏ జిల్లా అధ్యక్ష, ఉపాధ్యక్షులు రమేష్, రాజు, ప్రధాన కార్యదర్శి జాషువా తదితరులు పాల్గొన్నారు.